క్లుప్తంగా

వేకువజామునే పారిశుధ్య పర్యవేక్షణ



పారిశుధ్య కార్మికుల మస్తర్ల పుస్తకాన్ని తనిఖీ చేస్తున్న కమిషనర్ మనోహర్

అమలాపురం టౌన్: మున్సిపల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.మనోహర్ గురువారం వేకువజామునే పట్టణంలోని పలు వీధుల్లోకి వెళ్లి పారిశుధ్య పరిస్థితులను పర్యవేక్షించారు. స్థానిక ముమ్మిడివరం గేటు సెంటరులో పారిశుధ్య కార్మికులకు రోజువారీగా నిర్వహించే మస్తర్ల పుస్తకాన్ని(హాజరు పట్టీని) స్వయంగా తనిఖీ చేశారు. పట్టణ పారిశుధ్య పనులు పారదర్శకంగా జరగాలని శానిటేషన్ మేస్త్రీలకు సూచించారు. పారిశుధ్యం విషయంలో రాజీపడేది లేదని హెచ్చరించారు.

పద్మ అవార్డులపై హర్షం

త్ాళ్లరేవు: ప్రముఖ సినీ నటుడు చిరంజీవి, మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, ప్రముఖ హరికథా కళాకారిణి ఉమామహేశ్వరిలకు కేంద్ర ప్రభుత్వం పద్మ అవార్డులు ప్రకటించడంపై కాకినాడ మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు గురువారం హర్షం వ్యక్తం చేశారు.

మున్సిపల్ ఉద్యోగుల యూనియన్ ఎన్నిక

యానాం: యానాం మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెనుపోతు కృష్ణ, ఉపాధ్యక్షుడిగా కర్రి రాంబాబు, సెక్రటరీగా చెల్లి గోపీనాథ్, జాయింట్ సెక్రటరీగా అత్తిలి గోవిందరాజు, ట్రెజరర్‌గా వి.తేజకిరణ్మయితో పాటు మరో నలుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ఎన్నికయ్యారు.

యానాం ఎస్పీగా రాజశేఖరన్ నియామకం

యానాం: యానాం నూతన సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(ఎస్పీ)గా యు.రాజశేఖరన్‌ను నియమిస్తూ హోంశాఖ కార్యదర్శి ఎంపీ హీరాన్ గురువారం ఆదేశాలు జారీచేశారు. ఇప్పటివరకూ ఎస్పీగా కొనసాగిన ఆర్.రఘునాయగంను పుదుచ్చేరి స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. అదే విధంగా మాహేకు శర్వణన్, పుదుచ్చేరి సౌత్‌కు భక్తవత్సలన్‌ను నియమించారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటిన విద్యార్థిని



గెలుపొందిన బహుమతులతో కీర్తన

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కృపా కీర్తన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో ప్రతిభను చాటిందని పీడీ గొలకోటి ఫణీంద్ర గురువారం తెలిపారు. కీర్తన ఇటీవల గుంటూరు జిల్లా నరసారావుపేటలో జరిగిన అండర్–17 బాలికల క్రికెట్ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు తరఫున రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని విజయం సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు లంకా రాణి, పీడీలు డి.సరస్వతి, వి.విజయభాస్కర్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు కీర్తనను అభినందించారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

మామిడికుదురు: పాశర్లపూడిలంక అంబేడ్కర్ నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం దాతలు స్కూలు బ్యాగులు పంపిణీ చేశారు. వుండ్రు సూర్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన సతీమణి వుండ్రు రాజేశ్వరి, ఆమె కుమారులు, కోడళ్లు ఐఏఎస్ అధికారులు వుండ్రు రాజశేఖర్, నీర్జా శేఖర్, వుండ్రు లక్ష్మీకాంతారావు, నీలమ్‌రావు ఈ బ్యాగులు అందించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ కమిటీ ప్రతినిధులు సుధాకర్, నేలపూడి ఆనందరావు, బాబూరావు, కోటి, హెచ్‌ఎం కాజులూరి సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

బీసీలను ప్రోత్సహించాం

కాట్రేనికోన: బీసీలను రాజకీయంగా ప్రోత్సహించింది టీడీపీ మాత్రమేనని ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. కాట్రేనికోనలో గురువారం జరిగిన జయహో బీసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సముద్ర జలాలు, గోదావరి పాయల్లో చమురు సంస్థల కార్యకలాపాలతో మత్స్య సంపదకు తీవ్ర నష్టం కలిగిందని ఆరోపించారు. కార్యక్రమంలో జనసేన నేత పితాని బాలకృష్ణ, రెడ్డి సుబ్రహ్మణ్యం, గుత్తుల సాయి, గంటి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మానందం పుట్టినరోజు వేడుకలు

అమలాపురం టౌన్: హాస్యనటుడు బ్రహ్మానందం పుట్టినరోజు వేడుకలు గురువారం స్థానిక జిల్లా కార్పెంటర్ల సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన తెరపై కనిపిస్తే చాలు నవ్వు వచ్చేంత రీతిలో బ్రహ్మానందం హాస్యాన్ని పండిస్తారని సంఘం జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి అన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు గున్నేపల్లి భీమశంకరం, పొర్లె లక్ష్మణరావు, బట్టేలంక నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే సీఎం జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- లబ్ధిదారులకు ఆసరా చెక్కు అందజేత




లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

ఐ.పోలవరం: సామాజికంగా, ఆర్థికంగా మహిళా సాధికారత సాధించే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని టీటీడీ బోర్డు మెంబర్, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ఐ.పోలవరం మండలం బాణాపురంలో ఆసరా నాలుగో విడతగా మంజూరైన రూ.8,53,39,830 చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ కన్వీనర్ పిన్నమరాజు వెంకటపతిరాజు(శ్రీను) అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. నవరత్నాల్లో భాగంగా వైఎస్సార్ ఆసరా పథకం అమలు చేసి నాలుగు విడతల్లో నియోజకవర్గంలో సుమారు రూ.160 కోట్లు బ్యాంకు రుణాలు ప్రభుత్వమే చెల్లించిందన్నారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి మహిళల పక్షపాతిగా పాలన కొనసాగిస్తున్నారన్నారు. గర్భిణుల నుంచి వృద్ధుల వరకూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. తల్లులకు, ఆరేళ్ల లోపు పిల్లలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం, అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలతో ఎంతో మేలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా ప్రతి నెలా రూ.3 వేలు నగదు నేరుగా లబ్ధిదారులకు అందజేస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ విశ్వసనీయత చాటుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. అనంతరం సభకు హాజరైన డ్వాక్రా మహిళలు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మోర్తరాణి మిరియాం జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజు, రాష్ట్ర కార్యదర్శులు కోరుకొండ సత్యనారాయణ(ఢిల్లీ నారాయణ), పెన్మత్స చిట్టిరాజు, కాటం సత్తిరాజు, బి.వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరాజు, దంతులూరి వెంకట రాఘవరాజు, పిన్నంరాజు బాబ్జిరాజు, కాశి బాలమునికుమారి, విత్తనాల శ్రీనివాసరావు, తోట మాణిక్యాలరావు, పెన్మత్స వాసురాజు, నఖిలే వెంకటేశ్వరరావు, నల్లా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సర్వతోముఖాభివృద్ధే ధ్యేయం

- మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ గంగాభవాని
- రూ.23.40 కోట్లతో వార్షిక అంచనా బడ్జెట్



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కోలా గంగాభవాని

ముమ్మిడివరం: గ్రామాల్లో సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి పథకాలు ప్రవేశపెడుతుందని ఎంపీపీ కోలా గంగాభవాని పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం జరిగిన వార్షిక బడ్జెట్ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండలాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. పార్టీల కతీతంగా గ్రామస్థాయిలో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలన్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ కుడిపూడి శివశంకరరావు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ మండలాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం వివిధ శాఖల పనితీరు, ప్రగతిని ఆయా శాఖాధికారులు వివరించారు.

అంచనా బడ్జెట్‌కు ఏకగ్రీవంగా ఆమోదం

మండల పరిషత్ 2024–25 సంవత్సరానికి గాను వార్షిక అంచనా బడ్జెట్‌ను రూ.23,40,13,000 ప్రవేశపెట్టగా సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. తొలుత మండల పరిషత్ 2023–24 గడచిన ఏడాది బడ్జెట్‌ను సవరిస్తూ వచ్చే ఏడాదికి అంచనా బడ్జెట్‌ను రూపొందించారు. ఈ బడ్జెట్ అంశాలను సమావేశంలో ప్రవేశపెట్టి ఆదాయ, వ్యయాలకు సంబంధించిన వివరాలను సర్వసభ్య సమావేశంలో తెలియజేశారు. బడ్జెట్‌లో వివిధ ఆదాయ వనరుల నుంచి రాబడిని రూ.23,40,13,000గా, వివిధ వ్యయాల రూపేణా ఖర్చును రూ.23,39,67,000గా చూపిస్తూ అంత్య నిల్వ రూ.46,000గా పేర్కొన్నారు. బడ్జెట్‌లో ప్రాథమిక విద్యకు ప్రభుత్వం నుంచి వచ్చే రూ.12.78 కోట్లను ఆదాయంగా చూపిస్తూ ఉపాధ్యాయుల జీతభత్యాలకు వ్యయంగా చూపారు. అలాగే జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే రూ.9 కోట్లను ఆదాయంగా చూపుతూ గ్రామాల్లో వివిధ పనులకు గాను రూ.9 కోట్లు వ్యయంగా చూపారు. వార్షిక అంచనా బడ్జెట్‌లో మండల పరిషత్ సాధారణ నిధులు రూ.17,89,000 చూపిస్తూ దాంట్లో 23 శాతం వివిధ అభివృద్ధి పనులకు, 15 శాతం షెడ్యూలు కులాల అభివృద్ధికి, 6 శాతం షెడ్యూలు తెగల అభివృద్ధికి, 15 శాతం స్త్రీశిశు సంక్షేమానికి, 12 శాతం అత్యవసర మంచినీటి సౌకర్యం, 15 శాతం కార్యాలయ నిర్వహణ, 4 శాతం అత్యవసర కాంటిజెంట్, 10 శాతం విద్య, వైద్య, వ్యవసాయం, పశుగణాభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు బడ్జెట్‌లో చూపారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఏఆర్ శ్రీనివాస్, ఎంఈఓ బొజ్జా రమణశ్రీ, వైఎస్ ఎంపీపీలు పాము నాగవేణి, మట్టపర్తి సురేష్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

నేడు సుంకటరేవులో ఆసరా కార్యక్రమం



సుంకటరేవులో ఆసరా సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

తాళ్లరేవు: మండలంలోని పోలేకుర్రు పంచాయతీ సుంకటరేవులో ఉన్న ఎస్ఆర్ వెంచర్స్ ప్రాంగణంలో శుక్రవారం ఆసరా సభ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశారు. సభ ఏర్పాట్లను టీటీడీ బోర్డు మెంబర్, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు మహిళలకు ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా రుణమాఫీని వైఎస్సార్ ఆసరా పథకం కింద అందిస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి ఎన్నికలకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మహిళలందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని పార్టీ నేతలు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, వైస్ ఎంపీపీ డి.నాగేంద్రప్రసాద్, స్థానిక సర్పంచ్ వెంటపల్లి నూకరాజు ఉన్నారు.

సైన్సు ప్రదర్శనలో కోనసీమ ప్రతిభ



అవార్డు అందుకుంటున్న జిల్లా విద్యార్థులు

సాక్షి, అమలాపురం: దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లాలోని మూడు పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారని జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడలో ఆరు రాష్ట్రాల విజేతలు కలిసి నిర్వహించిన దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా నుంచి మూడు ప్రాజెక్టులు ఉత్తమ ప్రతిభను కనబరిచాయన్నారు. వన్నెచింతలపూడి, నేదునూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలు టాప్ 5, 6 క్యాటగిరీల్లో నగదు బహుమతి, ప్రశంసా పత్రాలు అందుకున్నాయన్నారు. అమలాపురం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రోత్సాహక బహుమతికి ఎంపికైందని తెలిపారు. విద్యార్థులను కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎంఈఓ ఎం.కమల కుమారి, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మధుసూదన్, ఉప విద్యాశాఖాధికారి లక్ష్మీనరసింహ ఫణి, జిల్లా పరీక్షల విభాగ అధికారి నక్క సురేష్ ప్రశంసించారు.

పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడికి సత్కారం



ఉప్పలగుప్తంలో కదలి నాగేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న గ్రామస్తులు

ఉప్పలగుప్తం: పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు కదలి నాగేశ్వరరావును కామరాజుపేటలో గురువారం పలువురు నాయకులు, గ్రామస్తులు, తోటి ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. నాగేశ్వరరావు మామిడికుదురు, కాట్రేనికోన మండలాలతో పాటు ఉప్పలగుప్తం మండలంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయునిగా పని చేసి పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు దంపతులను గ్రామస్తులు పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, ఎంఈవో నక్తి సత్యకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు తాళ్ల లక్ష్మీనరసాయమ్మ, వంగా గిరిజాకుమారి, పీఎంసీ చైర్మన్ దోనిపాటి వెంకట రామకృష్ణ, ఎస్టీయూ నాయకులు చిక్కం మైనర్‌బాబు, నూకల బుషేంద్ర, యూటీఎఫ్ నాయకులు బీబీఆర్ ప్రసాద్, ఎ.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే వేగవంతం చేయండి

జేసీ నుపూర్ అజయ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ నుపూర్ అజయ్

సాక్షి, అమలాపురం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష, రీ సర్వే మూడో దశ అన్ని ప్రక్రియలు పూర్తి చేసి భూ హక్కు పత్రాలు పంపిణీకి సిద్ధం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ ఆదేశించారు. అమరావతి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి జేసీతో పాటు పలు శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈనాం అసైన్డ్ భూములపై హక్కుల కల్పన, టేక్ హోమ్ రేషన్, సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, వేతన కూలీలకు సరాసరి వేతనాలు అందజేత, పని దినాల కల్పన, నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పట్టాల పంపిణీ, ప్లాట్ నెంబర్ సరిహద్దులతో సహా రిజిస్ట్రేషన్, పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులైన మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు, దివ్యాంగులకు ర్యాంపుల నిర్మాణాల్లో పురోగతి, 10వ తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షల నిర్వహణ సన్నద్ధత తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం ఆమె స్థానిక అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ మూడో దశ రీసర్వేకు సంబంధించి డ్రాఫ్ట్ ఫైనల్, ఆర్వోఆర్, స్టోన్ ప్లాంటేషన్, క్లారికల్ మాడ్యూల్స్ ప్రక్రియలు పూర్తి చేసి భూహక్కు పత్రాల పంపిణీకి సన్నద్ధం కావాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నిత్యావసరాలను లక్ష్యం మేరకు ఉంచాలన్నారు. నరేగా పథకం ద్వారా వేతన జీవులకు పనులు కల్పించడంతో పాటు తద్వారా సమకూరిన మెటీరియల్ కాంపొనెంటుతో అభివృద్ధి పనులు చేయడంపై దృష్టి పెట్టాలని జేసీ నుపూర్ అజయ్ ఆదేశించారు. డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, సీపీఓ వెంకటేశ్వర్లు, నోడల్ అధికారి భీమేశ్వరరావు, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, డీపీఓ వి.కృష్ణకుమారి, డీఈఓ ఎం.కమలకుమారి, డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర్‌ప్రసాద్‌లు పాల్గొన్నారు.

రవ్వ పరిశ్రమ లారీల అడ్డగింత



చల్లపల్లిలో రవ్వ పరిశ్రమ లారీలను అడ్డుకుని ధర్నా చేస్తున్న గ్రామస్తులు

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానంలో ఉన్న వేదాంత, కెయిర్న్ ఎనర్జీ అనుబంధ సంస్థలైన రవ్వ పరిశ్రమకు సంబంధించిన లారీ ట్యాంకర్‌లను చల్లపల్లి గ్రామస్తులు రోడ్డుపై టెంట్ వేసి గురువారం అడ్డుకున్నారు. అధ్వానంగా మారిన తమ గ్రామ రోడ్లకు మరమ్మతులు చేస్తామని మూడున్నరేళ్ల క్రితమే అప్పటి కలెక్టర్, పరిశ్రమ అధికారులు హామీ ఇచ్చినా నేటికి నెరవేర్చని కారణంగా ధర్నా చేపట్టినట్లు గ్రామస్తులు తెలిపారు. అమలాపురం రూరల్ మండలం నడిపూడి... నుంచి ఉప్పలగుప్తం మండలం ఎస్.యానం వరకు రహదారి దెబ్బతిని తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వెంటనే పరిశ్రమ అధికారులు స్పందించి చల్లపల్లి గ్రామంలో సీసీ రోడ్డు, నడిపూడి నుంచి ఎస్.యానం వరకూ బీటీ రోడ్డును నిర్మించాలని డిమాండ్ చేశారు. అప్పటివరకూ ధర్నా కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చీకురుమెల్లి సత్యనారాయణ, ఇసుకపట్ల రఘుబాబు, దంగేటి దొరబాబు, బాబులు, భోగిశెట్టి నరసింగరావు, కుంపట్ల నరసింహారావు, యరగర్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యునైటెడ్ టీచర్స్ అసోసియేషన్ ఎన్నిక



ఆర్‌ఐఓ మునిస్వామిని సత్కరించిన నూతన కార్యవర్గ సభ్యులు

యానాం: నియోజకవర్గ యునైటెడ్ టీచర్స్ అసోసియేషన్(యూటీఏ) నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. స్థానిక మహాత్మాగాంధీ ప్రభుత్వ పాఠశాల ఓపెన్ ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశంలో గౌరవ అధ్యక్షుడిగా తోట వెంకన్న, అధ్యక్షుడిగా కారుమూరి పవన్, ఉపాధ్యక్షులుగా బొంతు సత్యశ్రీనివాస్, ఎండీ హబీబున్నీషా, జనరల్ సెక్రటరీగా దాసరి కల్యాణ్‌బాబు, కార్యదర్శిగా ఎన్వీవీ రత్ననాయుడు, ట్రెజరర్‌గా హెచ్‌ఎంఎస్ సుబ్రహ్మణ్యం, సహాయ ట్రెజరర్‌గా పువ్వల జయపాల్, కోఆర్డినేటర్‌గా అరదాడి జయలక్ష్మితో పాటు 8 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌ను ఎన్నుకున్నారు. అనంతరం ఆర్ఐఓ మునిస్వామిని, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్‌ను, ఏడీపీసీ కమిడి ప్రభాకర్‌ను నూతన కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

ఉపాధ్యాయిని శిరోమణి సేవలు అభినందనీయం



ఉద్యోగ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయిని శిరోమణిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: ఉపాధ్యాయ వృత్తి ద్వారా ఎంతో మందిని ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దిన ప్రధానోపాధ్యాయురాలు పులపకూర సుందర శిరోమణి అభినందనీయురాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. స్థానిక గోపాలకృష్ణ గోఖలే మున్సిపల్ ప్రాథమిక పాఠశాల పాఠశాలలో ప్రధానోపాధ్యాయినిగా ఉద్యోగ విరమణ చేసిన శిరోమణి ఆత్మీయ వీడ్కోలు, అభినందన సభకు ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శిరోమణి పలుమార్లు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకుని ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చారన్నారు. అనంతరం శిరోమణి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, రాష్ట్ర దృశ్యకళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్య శైలజ, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, కౌన్సిలర్ వాసర్ల లక్ష్మి, బాసిన అనంతకుమార్, నక్తి నాగబాబు, పుత్సా కృష్ణ కామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఎఫ్‌సీఐ ప్రతినిధుల నియామకం



ఎంపికైన ప్రతినిధులకు నియామక పత్రాలు అందిస్తున్న పీటర్ తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక సెయింట్స్ జాన్ లూథరన్ చర్చ్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఫ్రీడమ్ ఫర్ క్రిస్టియన్ ఇంటిగ్రిటీ(ఎఫ్ఎఫ్‌సీఐ) జాతీయ అధ్యక్షుడు పీటర్ పుట్ట, రాష్ట్ర అధ్యక్షుడు స్టీఫెన్ బాబు, రాష్ట్ర కార్యదర్శి క్రాంతికుమార్‌ల ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జులను నియమించారు. ఎఫ్ఎఫ్‌సీఐ కార్యనిర్వాహక కార్యదర్శులుగా క్రాంతికుమార్, బిషప్ జల్లి జార్జి, లీగల్ అడ్వయిజర్లుగా ఆనంద్ ప్రసాద్, బిషప్ సువర్ణరాజు, మీడియా కో ఆర్డినేటర్‌గా డాక్టర్ జల్లి విక్టర్‌కుమార్ నియమితులయ్యారు. వారికి సంస్థ జాతీయ అధ్యక్షుడు పీటర్ పుట్ట చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పీటర్ పుట్ట మాట్లాడుతూ క్రైస్తవులపై జరుగుతున్న దాడుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో క్రైస్తవ నాయకులు ఎస్.ప్రభుకుమార్, బి.హోసన్న, పాస్టర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

యానాం ఎస్ఐగా మురుగనాథన్

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వం యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్‌లలో ఎస్ఐలను బదిలీ చేస్తూ గురువారం ఆదేశాలు జారీచేసింది. యానాం స్టేషన్ ఎస్ఐగా జె.మురుగనాథన్‌ను నియమించారు. యానాం స్టేషన్ ఇన్‌చార్జిగా ఉన్న శేరు నూకరాజును ట్రాఫిక్ విభాగానికి, సీబీసీఐడీ ఎస్ఐ బడుగు కనకారావును సిగ్మా సౌత్ పీఎస్‌కు, పీసీఎస్ సెల్ ఏఎస్ఐ కట్టా సుబ్బరాజును సీసీఆర్ పుదుచ్చేరికి, ట్రాఫిక్ విభాగం ఎస్ఐ పువ్వల వీరభద్రస్వామిని ట్రాఫిక్ పీఎస్(ఈస్ట్) పుదుచ్చేరికి బదిలీ చేస్తూ ఎస్పీ సుభమ్ గోష్ ఆదేశాలు జారీచేశారు.

ముస్లిం నేత కమల్‌పాషా మృతికి సంతాపం

యానాం: నియోజకవర్గ పరిధిలోని మసీద్ ఏ కూబా ఉపాధ్యక్షుడు, ముస్లిం సీనియర్ నేత కమల్ పాషా ఆకస్మిక మృతికి గురువారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సంతాపం వ్యక్తం చేశారు. కమల్‌పాషా ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేవారన్నారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

కార్యదర్శి చేగొండికి ఘన నివాళి

అమలాపురం రూరల్: బండారులంక పంచాయతీ కార్యదర్శి చేగొండి సత్యనారాయణమూర్తి మృతి తీరని లోటని ఎంపీడీఓ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో చేగొండి సంతాప సభ నిర్వహించారు. సూపరింటెండెంట్ కుమారి, జిల్లా కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు రుద్రరాజు సూరపరాజు, కార్యదర్శులు, పంచాయతీ ఉద్యోగులు పాల్గొని చేగొండి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బండారులంక పంచాయతీ కార్యాలయం వద్ద మూర్తి చిత్రపటానికి ఉపసర్పంచ్ కామిశెట్టి శ్రీనివాసరావు, పంచాయతీ గుమస్తా సత్యనారాయణరాజు, జాన గణేష్, పెదరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా అమలుచేయాలి

తాళ్లరేవు: ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. స్థానిక ప్రజా సంఘాల భవనంలో గురువారం సంఘ అధ్యక్షుడు టి.ఈశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ సమావేశానికి సంఘ జిల్లా అధ్యక్షుడు కెఎస్ శ్రీనివాస్ మాట్లాడారు. కేంద్రంలో రెండోసారి బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేశారన్నారు. ఉపాధి పథకాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో సంఘ నాయకులు దుప్పి అదృష్టదీపుడు, మందనక్క తణుకురాజు, ఎస్.త్రిమూర్తులు, మాలయ్య, అబ్బులు అనసూయ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరిహారానికి ఐక్య పోరాటం

యానాం: నియోజకవర్గంలోని మత్స్యకారులకు రావాల్సిన ఓఎన్‌జీసీ నష్టపరిహారం పంపిణీపై ఐక్య పోరాటం చేయాలని నిర్ణయం తీసుకున్నామని గురువారం వివిధ పార్టీల ప్రతినిధులు తెలిపారు. స్థానిక గాజులవీధిలోని మినీ ఫంక్షన్ హాలులో జరిగిన అఖిల పక్ష సమావేశంలో నాయకులు మాట్లాడుతూ వేటపై ఆధారంగా చేసుకుని జీవిస్తున్న మత్స్యకార కుటుంబాలకు ఓఎన్‌జీసీ ప్రభుత్వానికి చెల్లించిన రూ.25 కోట్ల పరిహార సొమ్మును బాధిత కుటుంబాలకు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు గుత్తుల రామారావు, పెసింగి శ్రీను, కాంగ్రెస్ నేతలు మల్లాడి సత్తిబాబు, మల్లాడి బీరాస్వామి, బీజేపీ అధ్యక్షుడు కనకాల రాజు, బీఎస్పీ అధ్యక్షుడు ధూళిపూడి మధు, ఆమ్‌ఆద్మీపార్టీ అధ్యక్షుడు కొండమూరి హరి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ఎన్నికల కార్యాలయాల ఏర్పాటు

అమలాపురం రూరల్: లోక్‌సభ నియోజకవర్గాల్లో పార్టీ ఎన్నికల కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి గురువారం భీమవరం నుంచి ఆన్‌లైన్ ద్వారా లోక్‌సభ పార్టీ ఎన్నికల కార్యాలయాలను ప్రారంభించారన్నారు. ఈ సందర్భంగా గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, వేమా స్థానిక లోక్‌సభ పార్టీ ఎన్నికల కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో అనకాపల్లి ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు మోకా వెంకట సుబ్బారావు, ఇళ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖలో సుదీర్ఘ సేవలు అభినందనీయం



ఉద్యోగ విరమణ చేసిన పోలీసులను సత్కరించిన ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ ఖాదర్ బాషా

అమలాపురం టౌన్: పోలీసు శాఖలో దాదాపు 40 ఏళ్ల పాటు సుదీర్ఘ సేవలు చేసి ఉద్యోగ విరమణ చేస్తున్న ఆ నలుగురు పోలీసులు అభినందనీయులని జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ అన్నారు. ఎస్ఐ జి.అర్జునరావు, ఏఎస్ఐ ఆర్.వెంకటేశ్వరరావు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ పి.నాగేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ ఎంజేఆర్ రాజు ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా వారిని బుధవారం రాత్రి ఎస్పీ కార్యాలయానికి ఆహ్వానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ సుసరాపు శ్రీధర్ మాట్లాడుతూ ఇన్నేళ్లు పోలీసు శాఖలో మచ్చ లేకుండా ఉద్యోగం చేయడం గొప్ప విషయమని అభినందించారు. జిల్లా ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా మాట్లాడుతూ వారి శేషజీవితం ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్పీ కార్యాలయ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పరిహారంపై వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి



మాట్లాడుతున్న పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు

యానాం: స్థానిక నియోజకవర్గ మత్స్యకారులకు ఓఎన్‌జీసీ సంస్థ మంజూరుచేసిన నష్టపరిహారం పంపిణీ విషయంలో ప్రతిఒక్కరూ వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొందరు గత రెండు నెలలుగా ఓఎన్‌జీసీ పరిహారంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, దాన్ని మానుకోవాలని కోరారు. చమురు తవ్వకాల వల్ల వేట నష్టపోతున్న మత్స్యకారులకు పరిహారం ఇవ్వాలని 2020లో ఓఎన్‌జీసీ సంస్థతో కాకినాడలో అప్పటి కలెక్టర్ సమక్షంలో ఒప్పందం జరిగిందన్నారు. అలా ఏపీకి ఇచ్చే విధంగానే యానాంకు సైతం పరిహారం ఇచ్చేలా కృషి చేశామన్నారు. దానికోసం పుదుచ్చేరి ప్రభుత్వం 37 పాయింట్లపై ఓఎన్‌జీసీ సంస్థతో చర్చలు జరిపిందన్నారు. 24 నెలల పాటు పరిహారం ఇవ్వడానికి ఓఎన్‌జీసీ సంస్థ ఒప్పుకుని 5 వాయిదాల్లో కాకినాడ జిల్లా కలెక్టర్ అకౌంట్‌లో కట్టారన్నారు. అయితే యానాంలో అప్లికేషన్లు ఫైనల్ కాకపోవడంతో పాటు వచ్చిన 6,686 దరఖాస్తుల్లో 4,570 మాత్రమే ప్రభుత్వ అధికారుల కమిటీ రికమండ్ చేసిందన్నారు.